కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్‌స్టేషన్ పరిధిలోని జ్యోతినగర్ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం పట్టణంలోని పలు కాలనీల్లో కరెంటు సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జ్యోతినగర్, మార్కెట్ ఏరియా, కిందిబస్తీ, చాకలిబస్తీ, బ్యాంక్ కాలనీ, సంతోషిమాత గుడి లైన్, ఇందిరానగర్ కాలనీ, బృందావన్ కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా రమేష్‌గుప్తా



మేడ్చల్: మేడ్చల్ వాసవి క్లబ్ అధ్యక్షుడిగా తాళ్లపల్లి రమేష్‌గుప్తా నియమితులయ్యారు. క్లబ్ జిల్లా గవర్నర్ నర్సింలు ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యదర్శులుగా గోలీ లక్ష్మణ్, తాళ్లపల్లి నగేష్ నియమితులయ్యారు. క్లబ్ ద్వారా వైశ్యులు, ఇతరులకు మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు.

ఘనంగా నాగదేవత ఆలయ వార్షికోత్సవం



ఎదులాబాద్ వంజరివాడ నాగదేవత ఆలయం వద్ద అన్నదానం

ఘట్‌కేసర్: ఎదులాబాద్ వంజరివాడ నాగదేవత ఆలయ 15వ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు భవాని, అమరేందర్, వెంకటేశ్, నవీన్, మల్లికార్జున్‌రాజు, నాగరాజు, నర్సింగ్‌రావుముదిరాజ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు



ఘట్‌కేసర్‌లో భారతీయ కిసాన్ సంఘ్ నమోదు కార్యక్రమం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని శివారెడ్డిగూడ కొంతం అంజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యుడు కె.సురేందర్‌రెడ్డి హాజరై నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటే అనే నినాదంతో ముందుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామలింగారెడ్డి, జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అంజిరెడ్డి, కష్టారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి మృతి



రాములు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: ఇంటి నిర్మాణం కోసం హార్డ్‌వేర్ దుకాణంలో వస్తువులు కొనుగోలు చేస్తున్న సమయంలో గుండెపోటుతో మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రాములు యాదవ్ మృతి చెందాడు. పట్టణంలోని హార్డ్‌వేర్ దుకాణంలో సామగ్రి కొనుగోలు చేస్తుండగా రాములు గుండెపోటుతో షాపులోనే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించినా ఆయన అప్పటికే మృతి చెందాడు. పూడూర్ గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు భాస్కర్‌యాదవ్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, బాబు యాదవ్ తదితర నాయకులు నివాళులర్పించారు.

16న జరిగే కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి



సమ్మె నోటీసును అందజేస్తున్న కార్మిక సంఘ నాయకులు

పోచారం: దేశవ్యాప్తంగా ఈ నెల 16న జరిగే కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చింతల యాదయ్య కోరారు. ఈమేరకు మంగళవారం పోచారం మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మె చేపట్టినట్లు నోటీసులో పేర్కొన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.సబిత, పోచారం మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు గాంధారి అశోక్, ఇతర ప్రతినిధులు నల్లవెల్లి దాసు, డి.జగదీష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల హక్కులను కాపాడిన ఘనత కేసీఆర్‌దే..

మల్కాజిగిరి: ఛలో నల్గొండ సభకు మల్కాజిగిరి నుంచి భారీ ర్యాలీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మల్కాజిగిరి చౌరస్తాలో ర్యాలీని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ దగాకు గురైందంటే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కులను కాపాడిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ర్యాలీగా తరలివెళ్లిన వారిలో జేఏసీ వెంకన్న, జగదీష్‌గౌడ్, మురుగేష్, వీరేశం యాదవ్ తదితరులు ఉన్నారు.



మల్కాజిగిరిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

నిర్లక్ష్యంతో రైతు బేజార్..
రోడ్లపై వాహనదారుల పరేషాన్



ఘట్‌కేసర్‌లో రోడ్డుపై జరుగుతున్న వారం సంత

ఘట్‌కేసర్: నియోజకవర్గంలోని ఒకప్పటి గ్రామీణ ప్రాంతాలు నేడు పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. విద్యా, ఉపాధి కోసం నగర శివార్లకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరావడంతో జనాభా విపరీతంగా పెరిగిపోయింది. అభివృద్ధితో పాటు ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో సర్కారు విఫలం కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. నియోజకవర్గంలో రైతు బజార్లు లేక రోడ్లపై కూరగాయలు విక్రయిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. ఘట్‌కేసర్ పట్టణంలోని మెయిన్ రోడ్డు, అంబేడ్కర్‌నగర్, రైల్వే స్టేషన్ రోడ్డు, కరీంగూడ రోడ్డు, గురుకుల్ కళాశాల ఎదుట, ఎన్ఎఫ్‌సీనగర్, బాలాజీనగర్‌లో ప్రతివారం జరిగే సంతలో రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారు. క్రయవిక్రేతలతో రోడ్లపై అడుగు వేయలేని పరిస్థితి నెలకొంటోంది. దీంతో రోడ్లపై ట్రాఫిక్ జామై ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు కూడా తక్కువ ధరలో లభిస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా వారాంతపు సంతలను ఆశ్రయిస్తున్నారు. గతంలో పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుకు ఓ మాజీ ఎమ్మెల్యే తీవ్రంగా కృషి చేసినా ఫలించలేదు. కొన్ని రాజకీయ కారణాల వల్ల రైతు బజార్ ఏర్పాటు చేయాలనుకున్నా స్థలంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, శ్రీనిధి భవనం నిర్మించడంతో అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.

ట్రాఫిక్ జామ్..

పట్టణంలో రైతు బజార్ లేకపోవడంతో చిరు వ్యాపారులు రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఆయా రోజుల్లో క్రయవిక్రేతలతో రోడ్లపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులతో పాటు స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఘట్‌కేసర్ వారం సంతలో గతంలో జరిగిన ఓ కారు ప్రమాదంలో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయలయ్యాయి.

రైతులు, వినియోగదారులకు మేలు..

రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో రైతుల కంటే దళారులే ఎక్కువ లాభం పొందుతున్నారు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే అన్నదాతలు పండించిన కూరగాయలు స్వయంగా విక్రయించుకోవచ్చు. దీంతో రైతులకు లాభం చేకూరడమే కాకుండా వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు, తక్కువ ధరలకే లభిస్తాయి. గతంలో మాజీ మంత్రి వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ పనులు ప్రారంభించినా అందుబాటులోకి రాలేదు. రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులు, వినియోగదారుల మధ్య ఉన్న దళారీ వ్యవస్థ మాయమై అందరికీ మేలు జరుగుతుంది. అధికారులు, నాయకులు స్పందించి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తీవ్రం



ప్రతి వారం జరిగే వారసంతలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ప్రతి శుక్రవారం సాయంత్రం ఘట్‌కేసర్ పట్టణానికి రావాలన్నా.. తిరిగి ఇంటి వెళ్లాలన్నా ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి.

– బొక్క కృష్ణారెడ్డి, బొక్కనిగూడ, ఘట్‌కేసర్

రైతు బజార్ ఏర్పాటు చేయాలి



ఘట్‌కేసర్‌లో రైతు బజార్ ఏర్పాటు కోసం దశాబ్దకాలం ఎదురు చూస్తున్నాం. వారం సంత రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రైతు బజార్ ఏర్పాటు చేస్తే రైతులకు లాభం చేకూరుతుంది. వినియోగదారులకు తాజా కూరగాయలు తక్కువ ధరలకే లభిస్తాయి. అధికారులు స్పందించి రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

– గుండ్ల రామతీర్థ, ఘట్‌కేసర్

మల్లారెడ్డి క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో నిర్వహించిన మల్లారెడ్డి ఓపెన్ టూ ఆల్ గ్రేస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై విన్నర్ టీం గుర్రంగూడ జీఎన్ఆర్, రన్నర్ ఏఎస్‌రావు నగర్ స్మైకోల్డ్ టీంకు షీల్డ్‌తో పాటు రూ.50 వేలు, రూ.25 వేల నగదు బహుమతి అందజేశారు. ఆయన మాట్లాడు తూ యువత అన్ని రంగాల్లో ముందుండాలని, క్రీడలతో ఐక్యత పెరుగుతుందన్నారు. పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంకం రవి, చిరంజీవిముదిరాజ్, కానుగంటి శ్రీనివాస్, నాగేశ్, దుర్గేశ్, వెంకటేశ్, అశీష్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌదరిగూడలో కూల్చివేతలు



చౌదరిగూడలో నాలాపై నిర్మాణాల కూల్చివేతలు

ఘట్‌కేసర్: చౌదరిగూడలో నాలాపై నిర్మించిన అక్రమ కట్టడాలను ఇరిగేషన్, పంచాయత్‌రాజ్ శాఖ అధికారులు మంగళవారం కూల్చివేయించారు. నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తామని, అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ పరమేశ్, ఎంపీఓ నందకిశోర్, పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రా చెరువు కింద ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి



మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అఖిల పక్ష కమిటీ నేతలు

బోడుప్పల్: బోడుప్పల్ రా చెరువు కింద సర్వే నంబరు–262లో ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు, పాలకవర్గం కాపాడాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అఖిల పక్ష కమిటీ అధ్యక్షులు ఎల్లగోని బాల్‌రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రాపోలు శంకరయ్య కోరారు. రా చెరువు కింద ఉన్న ప్రభుత్వ స్థలంపై జిల్లా కలెక్టర్ గౌతమ్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వారు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బోడుప్పల్ రా చెరువు కింద ఉన్న సర్వే నంబరు–262లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలానికి బై నంబర్లు వేసి, అధికారులను తప్పుదారి పట్టించారన్నారు. అంతేగాకుండా తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇండ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అధికారులు, పాలకవర్గం వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు రా చెరువు కింద ఉన్న ప్రభుత స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు, సదరు స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. అఖిల పక్ష కమిటీ కోశాధికారి ఈగ వెంకటేశ్ ముదిరాజ్, సలహాదారులు బద్దుల సత్యనారాయణ యాదవ్, ఏనుగుల లక్ష్మయ్య, ప్రతినిధులు హరినాథ్‌గౌడ్, చీరాల జంగయ్య, రాపోలు రామస్వామి పాల్గొన్నారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్లు అందజేస్తూ..

అల్వాల్: ఖైరతాబాద్‌లో నిర్వహించిన 5వ ఓపెన్ స్టేట్ తైక్వాండో చాంపియన్‌షిప్ స్పారింగ్ నాకౌట్ పోటీల్లో రణ్‌వీర్ తైక్వాండో అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. పోటీల్లో విద్యార్థులు హర్షిత్, యోగిందర్, తరుణ్, యశ్వంత్‌కుమార్, రాజనందీశ్వరి, అశీష్, ఆషిక్, అబ్దుల్ సత్తార్, విఘ్నేష్, వినయ్, పావని, మహేష్‌లు బంగారు పతకాలు సాధించగా విక్రమ్ రాథోడ్, సంకీర్తన్‌లు రజత పతకాలు సాధించారు. కార్యక్రమానికి హాజరైన తైక్వాండో గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, చీఫ్ ఆర్గనైజర్ మస్తాన్, రఘురాంరెడ్డి, అనిష్ సెయాని, ఇన్సోనియా తైక్వాండో అకాడమీ కోశాధికారి మొయిన్ తదితరులు విద్యార్థులకు పతకాలు, సర్టిఫికేట్లను అందజేశారు.

బోడుప్పల్‌లో కలెక్టర్ గౌతమ్ పర్యటన



బోడుప్పల్‌లో కమిషనర్‌ను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్



వ్యర్థాలతో తయారు చేసిన బ్రికెట్ పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

బోడుప్పల్: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్ రెడ్డితో కలిసి లక్ష్మినగర్‌లో హుడా పార్కును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను, చెత్త డంపింగ్ యార్డు(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు)ను సందర్శించి చెత్త సేకరణ, చెత్తను జవహర్‌నగర్‌కు తరలించేందుకు అనుసరిస్తున్న విధానాన్ని, రా చెరువును సందర్శించి అక్కడి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మేనేజర్ నాగేంద్రబాబు, డీఈలు బాలమురళి, శారద, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, ఆర్‌ఐలు సునీత, నాగవల్లి, సర్వేయర్ రూప పాల్గొన్నారు.

వ్యర్థాల శుద్ధీకరణ పార్కును సందర్శించిన కలెక్టర్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమీకృత వ్యర్థ పదార్థాల శుద్ధీకరణ పార్కును మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. నగర పరిధిలో తడి, పొడి, హానికారక చెత్తను ఇళ్ల వద్దే వేరు చేసి సేకరించడంతో పాటు సేకరించిన చెత్తలో తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువు, పొడిచెత్తను రీసైక్లింగ్ ద్వారా తిరిగి వినియోగించుకునే విధానాన్ని, హానికారక చెత్తను క్షేత్రస్థాయిలో వేరు చేయడం, వెల్త్‌ఫ్రం వేస్టు, ప్లాస్టిక్ నివారణ, బర్తన్ బ్యాంక్ మొదలైన అంశాల పట్ల నగర ప్రజలకు అవగాహన కల్పించినట్లు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కలెక్టర్ గౌతమ్‌కు వివరించారు.

రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడ, రాజీవ్ గృహకల్ప, నారపల్లి, పోచారం ప్రాంతాల్లో రూ.1.25 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశామన్నారు. ఇందులో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వార్డుకు రూ.10 లక్షల చొప్పున 6, 17, 18వ వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. డ్రైనేజీ వ్యవస్థ కోసం 8వ వార్డుకు రూ.10 లక్షలు, 11వ వార్డుకు రూ.20 లక్షలు, 15వ వార్డుకు రూ.30 లక్షలు, 16వ వార్డుకు రూ.10 లక్షలు కేటాయించి పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ పశ్య వేమనరెడ్డి, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, నల్లవెల్లి లక్ష్మీశేఖర్, బైర హిమ బలయ్య, అబ్బవతిని సరితా స్వామి, సుర్వి సుధా లక్ష్మి, మోటుపల్లి పోచమ్మ, బద్దం మమత జగన్ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు అక్రమ్ అలీ, ఏఈ నరేష్, నాయకులు మందడి సురేందర్‌రెడ్డి, అబ్బవతిని నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా ప్రపంచం వైపు దృష్టి సారించాలి



విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపల్ అపర్ణ

జవహర్‌నగర్: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన జవహర్‌నగర్ సీఆర్‌పీఎఫ్ స్కూల్ విద్యార్థులకు మంగళవారం క్యాంపస్‌లో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ డి.అపర్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. సీఆర్‌పీఎఫ్ స్కూల్‌లో చదువు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయంగా మారిందన్నారు. నేటి విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ క్రీడా ప్రపంచం వైపు దృష్టి సారించాలన్నారు. గుజరాత్‌లో నిర్వహించే అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన వసంత్, రషీత్‌లను ప్రిన్సిపల్ అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్, పాఠశాల బృందం సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకట్‌రాజు, ఆకాజీకుమార్, కిషోర్, గోపాలకృష్ణ, దివ్య, సబీనా, నవనీతరాణి, చంద్రశేఖర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలపై ఆగ్రహం



నాడెం చెరువు బఫర్‌లో నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఏఈ

ఘట్‌కేసర్: వెంకటాపూర్ నాడెం చెరువు నాలాను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ పరమేశ్, ఎంపీఓ నందకిశోర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాడెం చెరువు బఫర్ జోన్ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువకు ఇరువైపులా ప్రహరీ నిర్మిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను డిమాండ్ చేశారు. ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, ఆర్‌ఐ చారి, రమేశ్ పాల్గొన్నారు.

అబ్దుల్ రెహాన్‌ను అభినందించిన డీఈఓ



సాక్షి, మేడ్చల్ జిల్లా: సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు(స్థానం) పొందిన అబ్దుల్ రెహాన్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి అభినందించారు. డీఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ర్యాంకు సాధించేందుకు తోడ్పాటు అందించిన వారి గైడ్ టీచర్ అరుణ్ జ్యోతిని కూడా ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ అధ్యక్షుడు మదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.శీనయ్య, ప్రమీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని డీఈఓ విజయకుమారి శాలువాతో సన్మానించారు.

బాదంతో.. గుండెకు బలాన్నివ్వాలి..

సాక్షి, సిటీబ్యూరో: ప్రేమించే గుండె బలోపేతం కావడానికి పరస్పరం తగిన వాలంటైన్స్ డే బహుమతుల్ని ప్రేమికులు ఇచ్చి పుచ్చుకోవాలని ఫిట్‌నెస్, సెలబ్రిటీ ఇన్‌స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా న్యూట్రిషన్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామిలు ఓ ప్రకటనలో సూచించారు. జింక్, ఫోలేట్, ఐరన్, విటమిన్ ఇ, మెగ్నీషియం ప్రోటీన్‌లతో సహా 15 పోషకాలతో నిండిన బాదం గింజలు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయని, అంతేగాకుండా చర్మ ఆరోగ్యాన్ని, అధిక బరువు సమస్య తగ్గించడానికి, రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడతాయన్నారు. ఈ నేపథ్యంలో ఆల్మండ్స్ గిఫ్ట్ ప్యాక్స్‌ను ఈ వాలెంటైన్స్ డే బహుమతుల్లో చేర్చాలన్నారు.

హత్యాయత్నం చేసిన నిందితుడు అరెస్ట్



చామకూర ప్రతాప్

పోచారం: కుటుంబ కలహాల కారణంగా భార్యతో పాటు కోడలిపై హత్యాయత్నం చేసిన వ్యక్తిని పోచారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బి.రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నానగర్‌లో చామకూర ప్రతాప్(54) తాపీమేస్త్రి. కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇతడి కుమారుడు శివాజీకి తన భార్య ప్రమీల అన్న కుమార్తె కల్యాణికి 2019లో వివాహం జరిగింది. ఈ పెళ్లి జరగడం ప్రతాప్‌కు ఇష్టం లేకపోవడంతో తరచూ భార్యతో పాటు కుటుంబ సభ్యులతో గొడవపడే వాడు. వ్యవసాయ భూమిపై వచ్చే ఆదాయంతో పాటు మేస్త్రి పని చేస్తే వచ్చే డబ్బును ఇంట్లో ఖర్చులకు ఇవ్వకుండా ప్రతాప్ జల్సాలకు వాడుకుంటున్నాడు. ఇదే విషయంపై 2017వ సంవత్సరంలో ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా గత ఏడాది డిసెంబర్ 20న భార్యతో కావాలని ప్రతాప్ గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో గొడ్డలి తీసుకుని భార్యతో పాటు అడ్డువచ్చిన కోడలిని హత్య చేసేందుకు దాడి చేసి పరారయ్యాడు. ఈ దాడిలో కోడలికి తలపైన, భార్యకు నుదిటిమీద గాయాలు తగిలాయి. మంగళవారం నిందితుడు అన్నోజిగూడ బస్టాప్ వద్ద ఉండగా పోలీసులు అరెస్ట్ చేసి, హత్యాయత్నానికి వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా మహర్షి దయానంద సరస్వతి జయంతి



జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆర్య సమాజ్ నిర్వాహకులు

ఉప్పల్: ఉప్పల్‌లో మహర్షి దయానంద సరస్వతి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆర్యసమాజ్ వ్యవస్థాపకులు ఆచార్య వేద సింధూ ఉప్పల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్‌రావు, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌లు పాల్గొన్నారు. అంతకుముందు ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐ నుంచి ర్యాలీగా వచ్చి ఉప్పల్ జోషి స్కూల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దయానంద సరస్వతి స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకభూమిక పోషించాడని కొనియాడారు. కార్యక్రమంలో స్వామి యజ్ఞదేవ్, హరిద్వార్, అరుణ్ కుమార్, డా.కమల్ నారాయణ, ధర్మతేజ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆర్యసమాజ్ నిర్వాహకులు పాల్గొన్నారు.